# మాతా శిశు సంరక్షణకు దోహదం

- గర్భిణులకు వరంగా పీఎం మాతృత్వ వందన యోజన
- గర్భిణులకు వైద్య పరీక్షలతోపాటు, మూడు విడతలుగా రూ.5 వేలు చెల్లింపు


పిప్పర పీహెచ్‌సీలో గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి

**గణపవరం:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (పీఎం ఎంవీవై) పథకం గర్భిణులకు వరంగా నిలిచింది. మాతా శిశు సంరక్షణకు ఈ పథకం ఎంతో దోహద పడుతుంది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజనగా అమలుచేసిన ఈ పథకం బీజేపీ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత 2016 నుంచి పేరుమార్చి ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన(పీఎంఎంవీవై)గా అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా అందించే నగదు ప్రోత్సాహకంతో గర్భిణులు, బాలింతలు, మెరుగైన వైద్యం పొందడానికి, నవజాత శిశువుల సంరక్షణకు, వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది. గణపవరం మండలంలోని గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలో సుమారు 450 మంది గర్భిణులు, బాలింతలు ఈ పథకంలో లబ్ధిదారులుగా ఉన్నారు. ఈ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి వర్తించేలా వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతల నమోదు ప్రక్రియను నిరంతరం నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో గర్భిణులను గుర్తించి వైద్యశాఖ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. దీనితోపాటు గత మూడేళ్లలో నమోదు చేసుకోని చిన్నారుల తల్లులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేశారు. దీంతో ఈ పథకంలో లబ్ధిపొందే మహిళల సంఖ్య పెరుగుతుంది.

**పీఎంఎంవీవై పథకానికి అర్హతలు**

- గర్భందాల్చిన మహిళలు మూడు నెలలలోపు పీఎంఎంవీవై పథకం కోసం వార్డు, గ్రామ సచివాలయాల్లోని వెల్‌నెస్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి.
- గర్భిణులు తప్పనిసరిగా మదర్ చైల్డ్ ప్రొటెక్షన్ (ఎంసీపీ) కార్డు కలిగి ఉండాలి.
- 19 సంవత్సరాలు నిండిన తర్వాత గర్భం దాల్చిన మహిళలు ఈ పథకానికి అర్హులు.
- పీహెచ్‌సీల్లో ప్రతి నెలా 9వతేదీన నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన శిబిరంలో గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

**నగదు చెల్లింపులు ఇలా**

- గర్భం దాల్చిన నాటినుంచి ప్రసవం అయ్యేవరకూ కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా మూడు విడతలుగా రూ.5 వేలు చెల్లిస్తుంది.
- మొదటి విడతగా అంగన్‌వాడీ కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో గర్భిణిగా నమోదైన వెంటనే రూ.1000 లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో జమచేస్తారు.
- గర్భం దాల్చిన ఆరునెలల పాటు క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ తీసుకున్న గర్భిణికి రెండో విడతగా రూ.2 వేలు అందిస్తారు.
- ప్రసవం అయినతర్వాత మూడో విడతగా రూ.2 వేలు చెల్లిస్తారు.

### పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం నవజాత శిశువులు, తల్లుల సంరక్షణకు ప్రవేశపెట్టిన పీఎంఎంవీవై పథకాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి. నిర్ణీత సమయంలో గర్భిణులు తమ వివరాలను నమోదు చేసుకుని పథకం లబ్ధిని పొందాలి. ప్రతి నెలా 9వతేదీన పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నాం. ఈపథకం అమలుపై అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందికి నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

– పి.కిరణ్మయి, గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి

## ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు


ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న అధికారులు

**భీమడోలు:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పోలసానిపల్లి పరీక్షా కేంద్రంలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి వేర్వేరు సమయాల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. ఐదో తరగతి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. ఈ పరీక్షకు 174మంది హాజరుకుగాను 162మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష నిర్వహణ తీరును తాడేపల్లిగూడెం సొసైటీ అధికారి శాంతి విశాల్ పరిశీలించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటలకు జూనియర్ ఇంటర్ ప్రవేశానికి పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 212 మందికిగాను 182 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ వి.వెంకట రమణ తెలిపారు. పరీక్షల పరిశీలకురాలుగా ఎస్వీ మీనాక్షి వ్యవహరించారు. ఈ రెండు పరీక్షల నిర్వహణకు స్క్వాడ్ అధికారిగా, ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు వ్యవహరించారు.

## క్లుప్తంగా

### రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ


ఉప్పుగూడెం రామాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

**దెందులూరు:** సోమవరప్పాడు పంచాయతీ ఉప్పుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆదివారం సీతారామ లక్ష్మణుడు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, మాజీ ఎంపీటీసీ జ్యోతి, మాగంటి వంశీ గిరిధర్, భక్తులు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఎల్ ఎస్‌వీ శాస్త్రి, సిద్ధాంతి అంబటి నూకరాజు, చంటి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

### చలివేంద్రం ప్రారంభం


గణపవరంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న లయన్స్ సభ్యులు

**గణపవరం:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు లయన్స్ క్లబ్‌లు ప్రాధాన్యత ఇస్తున్నట్లు లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు తెలిపారు. గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, గట్టిం మాణిక్యాలరావు, సూర్యనారాయణరాజు, సుబ్బారావు, పాపారావునాయుడు, లయన్స్ జోన్ చైర్మన్లు, గణపవరం క్లబ్ అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### నిత్యావసరాల అందజేత


బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేసిన దృశ్యం

**దెందులూరు:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో దిక్కుపాటి పెద్దిరాజు కుటుంబానికి చేయూత స్వచ్ఛంద సంస్థ ఆదివారం రూ.16 వేల నగదు, నిత్యవసర వస్తువులు అందజేసింది. ఇటీవల జరిగిన షార్ట్‌సర్క్యూట్ ప్రమాదంలో పెద్దిరాజు కుమార్తె గాయలపాలైంది. పెద్దిరాజు కూడా వికలాంగుడు కావడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకునికి వారికి తమ వంతు సహాయంగా నగదు, నిత్యవసర వస్తువులు అందించినట్లు చేయూత సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్థ ప్రతినిదులు ఎం.లక్ష్మీనారాయణ, పి.నాగార్జున, శరత్ బాబు, ప్రసాద్, రాటాలు రాంబాబు, మహేష్, మధు, దుర్గాప్రసాద్, అమరేశ్వరరావు పాల్గొన్నారు.

### అలరించిన శ్రీవారి కల్యాణం గానామృతం


వేంకటేశ్వరస్వామి కల్యాణ గానామృతాన్ని నిర్వహిస్తున్న భజన సంఘ సభ్యులు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి క్షేత్రంలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన శ్రీ లక్ష్మీ నారాయణ భజన సంఘం వారు నిర్వహించిన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ గానామృతం భక్తులను అలరించింది. ముందుగా వారు ఆలయ అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి పూజలు చేశారు. అనంతరం భజనలు చేస్తూ శ్రీవారి కల్యాణ గానామృతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

# భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ చర్చిలో నిర్వహిస్తున్న ప్రార్థనలు


భీమడోలు : పోలసానిపల్లిలో ఈతకొమ్మలతో ఊరేగింపు

**దెందులూరు:** మట్టల ఆదివారం పండుగను క్రైస్తవ విశ్వాసులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దెందులూరు, పోతునూరు, కొవ్వలి, రామారావుగూడెం, చల్లచింతలపూడి, పెరుగు సోమవారప్పాడు, గంగన్నగూడెం, జోగన్నపాలెం, కంద్రిగ సీతంపేట, కొమరేపల్లి పెరుగూడెం గ్రామాల్లో క్రైస్తవులు ర్యాలీలు నిర్వహించారు. సాల్వేషన్ ఆర్మీ, ఆర్‌సీఎం, సీఎస్ఐ, మన్న ఐసీఎం బైబిల్ మిషన్ సెవెంత్‌డే తో పాటు అన్ని స్వతంత్ర సంఘాల క్రైస్తవ చర్చిల సభ్యులు, సంఘ పెద్దలు యువత చిన్నారులు, దీక్షదారులు ఈత కొమ్మలకు పువ్వులు అలంకరించి అన్ని వీధుల్లో హోసన్నా జయము జయము అంటూ, గీతాలు ఆలపిస్తూ ర్యాలీలు నిర్వహించారు.

**భీమడోలు:** మండల వ్యాప్తంగా క్రైస్తవ దేవాలయాల్లో ఆదివారం మట్టల ఆదివారంను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి విచారణ కర్త ఫాదర్ షింటో థామస్, డీపాల్ స్కూలు ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్ జాన్ దివ్య పూజా బలిని సమర్పించారు. తొలుత డీపాల్ స్కూలు వద్ద క్రైస్తవ విశ్వాసులందరూ ప్రార్థనలు చేశారు.


భీమడోలు: ఆర్‌సీఎం చర్చిలో దివ్య పూజాబలిని సమర్పిస్తున్న విచారణకర్త షింటో థామస్


దెందులూరు: కొవ్వలిలో సాల్వేషన్ ఆర్మీ సంఘస్తుల ర్యాలీ

అక్కడ నుంచి వారంతా కొబ్బరి కొమ్మలను చేత పట్టుకుని హోసన్నా హోసన్నా దావీదు కుమారుడా జయం జయం అంటూ ర్యాలీ నిర్వహించారు. బాల ఏసులను కొత్త చీరలపై నడిపించారు. అనంతరం విచారణకర్త థామస్ షింటో థామస్, డీపాల్ ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్ జాన్ వాక్యోపదేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జింటో, ఫాదర్ జిజో, గురువులు, కన్య స్త్రీలు, విన్సెంట్ సొసైటీ సభ్యులు, పెద్దలు, జీసస్ యూత్, దళ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు. పోలసానిపల్లి బేతెస్థ ప్రార్థనా మందిరం పాస్టర్ జ్వాల ఎఫ్రాయిమ్ ఆధ్వర్యంలో మ్రాని కొమ్మల ఆదివారంను జరుపుకున్నారు. చర్చిలోని విశ్వాసులు, సండే స్కూలు చిన్నారులు ఈత కొమ్మలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు.


భీమడోలు: పురవీధుల్లో బాల ఏసులను నూతన వస్త్రాలపై నడిపిస్తున్న దృశ్యం

## ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు


హర్షిత బైపీసీ 948 మార్కులు


దొడ్డిగర్ల ప్రశాంతి, సీఈసీ (947)


విజయరాజు, ఎంపీసీ (940)


ఎం.భానుచరణ్ ఎంపీసీ (424)


హెచ్‌డీఎల్ శ్రావ్య బైపీసీ (412)


డి.జ్యోతి సీఈసీ (454)

**ఉంగుటూరు:** నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 62 మంది హాజరుకాగా 53 మంది ఉత్తీర్ణులై 85 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు చెప్పారు. అలాగే ప్రథమ సంవత్సరం పరీక్షలకు 118 మంది విద్యార్థులు హాజరుకాగా 71 మంది ఉత్తీర్ణులై 60 శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు చెప్పారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థిని హర్షిత 948 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ఎంపీసీ విద్యార్థి హనుమంతు విజయరాజు 940 మార్కులు, సీఈసీ విద్యార్థిని దొడ్డిగర్ల ప్రశాంతి 947 మార్కులు సాధించింది. అలాగే ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బైపీసీ విద్యార్థిని హనుమంత దుర్గ వెంకట లక్ష్మి శ్రావ్య 412 మార్కులు, దంగి జ్యోతి సీఈసీలో 454 మార్కులు, మానూరి భానుచరణ్ ఎంపీసీలో 424 మార్కులు సాధించారు. 90శాతం మార్కులపైనే సాధించిన వారిలో మమతాగ్రేస్,అక్షయ, పి.సంధ్య, ఎన్ శ్రీవణి, పి.ప్రణీత, ఎం హేమంత్, వి.గాయత్రి ఉన్నారు.

## తారెత్తిస్తున్న ఎండలు


ఆదివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న గణపవరం మెయిన్‌రోడ్డు

**గణపవరం:** వేసవి ఆరంభంలోనే భానుడి విశ్వరూపం ప్రజలను తారెత్తిస్తుంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో ముఖ్యంగా మే నెలలో ఇంకెలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత పది రోజులుగా భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 11 గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 3 గంటలు దాటే వరకూ జనం ఇళ్లనుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే గణపవరం సెంటర్, మెయిన్‌రోడ్డుకూడా జనంలేక వెలవెలబోతున్నాయి. దీనితో వ్యాపారులు బేరాలు లేక ఢీలాపడుతున్నారు. తోపుడు బళ్ల వ్యాపారులు, చిరువ్యాపారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు మధ్యాహ్నం ఎండవేడిమికి తాళలేక దుకాణాలు మూసివేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనంకోసం ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు.

## సామ్రాజ్యవాద దేశాల తీరుతో మూడో ప్రపంచ యుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న కడుపు కన్నయ్య

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** సామ్రాజ్యవాద దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థికపరమైన ఒత్తుడులు చేస్తూ పరోక్షంగా మూడో ప్రపంచ యుద్ధానికి పురిగొలుప్పతున్నాయని ప్రముఖ వైద్య నిపుణుడు వైఎస్సార్ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం కపర్ది భవనంలో ఆదివారం సాయంత్రం భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కాఫ్) ఏలూరు జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు కడుపు కన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చూస్తుంటే మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 17 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ వైఎస్ఆర్ ప్రసాద్, అధ్యక్షుడిగా కడుపు కన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కేజే సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు.

## వ్యక్తికి తీవ్ర గాయాలు

**ద్వారకాతిరుమల:** స్థానిక గరుడాళ్వార్ సెంటర్‌లో శనివారం నలుగురు యువకులు గొడవ పడుతుండగా మధ్యలో అడ్డువెళ్లిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ కథనం ప్రకారం . గ్రామానికి చెందిన క్లోంపూడి సాయి దేవస్థానంలో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వెళుతుండగా గరుడాళ్వార్ సెంటర్‌లో గ్రామానికి చెందిన సీహెచ్ నరేష్, ధర్మ, శివ కుమార్, పి.కిరణ్ గొడవ పడుతుండడాన్ని గమనించి, అక్కడ ఆగాడు. ఎందుకు గొడవపడుతున్నారని అడుగగా నీకెందుకంటూ వారు సాయిని ఇష్టానుసారం కొట్టారు. దాంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. సాయి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందగా, అక్కడి నుంచి వచ్చిన ఎమ్మెల్సీ రిపోర్టుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా ర్యాలీ

**టి.నరసాపురం:** ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపినప్పుడే ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలు లభ్యమవుతాయని రైతు సాధికార సంస్థ ప్రతినిధి కుంచే గంగాధరరావు అన్నారు. విద్యార్థులతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ అప్పలరాజుగూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాలు 25 రకాలు తయారు చేసి, రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు ప్రతి ఆర్‌బీకే వద్ద అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల ఇన్‌చార్జి దుర్గ అప్పారావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 16న కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** నగరానికి చెందిన హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16, బుధవారం కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదపాటి రామకృష్ణ, గండికోట రాజేష్, కోశాధికారి కేవీ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో సాయంత్రం 6 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. కళాకారులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కోరారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయిలో రాణింపు


ఏలూరు సాయ్ సెంటర్‌లో సాధన చేస్తున్న దివ్య

**ఏలూరు రూరల్:** సాధారణంగా వెయిట్ లిఫ్టింగ్ అంటే పురుషులు గుర్తుకొస్తారు. భారీకాయులై పెద్ద పెద్ద బరువులు ఎత్తి పతకాలు సాధిస్తారని చెప్పుకుంటారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు సైతం వెయిట్ లిఫ్టింగ్‌పై ఆశక్తి చూపుతున్నారు. పురుషులకు దీటుగా బరువులు ఎత్తుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. గతంలో ఒలింపిక్ మెడలిస్ట్ కరణం మల్లీశ్వరి స్ఫూర్తితో ఎందరో మహిళలు వెయిట్ లిఫ్టింగ్‌లో రాణించారు. తర్వాత కొంత కాలం ఈ అంశంలో నిస్తబ్ధత ఏర్పడినప్పటికీ నేడు మళ్లీ బాలికలు వెయిట్‌లిఫ్టింగ్‌పై ఆశక్తి పెంచుకుని శిక్షణ పొందుతున్నారు.

**అద్భుత ప్రతిభ**

ఏలూరు సాయ్ సెంటర్ శిక్షణ పొందుతున్న పి.దివ్య వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తోంది. ఆమె ఏలూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. క్రమం తప్పకుండా శిక్షణ చేస్తూ పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకుంటోంది. గత ఏడాది జరిగిన జూనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ చేజిక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇదే క్రమంలో సౌత్‌జోన్ యూనివర్సిటీ పోటీల్లో సైతం సిల్వర్ మెడల్ సాధించింది. ఇక పాఠశాల, కళాశాల స్థాయిలో జరిగిన అనేక పోటీల్లో పతకాలు పంట పండించింది.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం

**ద్వారకాతిరుమల:** శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కదలి శ్రీనివాసరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

## జాబ్‌మేళాకు 210 మంది హాజరు

**జంగారెడ్డిగూడెం:** స్థానిక శ్రీరామచంద్ర జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రముఖ ఫార్మాకంపెనీ మెట్రో కెమ్ నిర్వహించిన జాబ్‌మేళాకు 210 అభ్యర్థులు హాజరైనట్లు మెట్రో కెమ్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ జాబ్‌మేళాను మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, శ్రీరామచంద్ర చైర్మన్ బీవీ కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మెట్రో కెమ్ వైజాగ్ జనరల్ మేనేజర్ దుర్గారావు, వైస్ చైర్మన్ రాంబాబు, హెచ్ఆర్ విభాగం ప్రతినిధి తేజ, పాలపర్తి శ్రీనివాస్, శ్రీరామచంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ వీవీఎస్ జగదీష్ కుమార్, ఏవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌తో బిల్లుల ఆదా

**ఏలూరు (టూటౌన్):** ఇంటింటా సోలార్ యూనిట్ల ఏర్పాటుతో కరెంట్ బిల్లుల ఆదాతో పాటు, ఉత్పత్తి చేసిన అదనపు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఎస్ఈ సాల్మన్ రాజు అన్నారు. ఆదివారం స్థానికంగా టెల్ టవర్స్ సోలార్, రాజ్ ప్రీమియం సోలార్ ప్యానల్స్‌ను రూపొందించింది. దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాల్మన్ రాజు పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీతో పాటు బ్యాంకు రుణ సదుపాయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నారా శేషు, రాజనాల రామ్మోహన్ రావు, పి.రాధాకృష్ణ, కేఎం అంబేడ్కర్, పి.అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




